భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ


పడిపూజలో యశ్వంత్ గురుస్వామి తదితరులు


మహా పడిపూజలో అయ్యప్ప స్వాములు

గౌలిపురా: శ్రీరాంనగర్ కాలనీలోని అయ్యప్ప ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ భక్తిశ్రద్ధలతో జరిగింది. డి.యశ్వంత్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 4 గంటలకు గణపతి హోమం, 9 గంటలకు అభిషేకం , 12.30 గంటలకు పడి హారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తి గీతాలతో స్థానికంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ పూజల్లో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో..

అబిడ్స్: అయ్యప్ప మహా పడిపూజ కనుల పండువగా నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్పా అంటూ అయ్యప్ప స్వాములు భజనలు, భక్తి గీతాలతో హోరెత్తించారు. గుడిమల్కాపూర్‌లో చిన్న గురుస్వామి, పవన్‌సింగ్ లోధ్ ఆధ్వర్యంలో జరిగిన పూజ వేడుకలు సుభాష్ యాదవ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు


కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఈవీఎస్‌కే బాబు, ప్రిన్సిపాల్ రేవ్ బ్రదర్ షజాన్ ఆంటోనిలు


విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

అబిడ్స్: విద్యార్థులకు విద్యతో పాటు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ముఖ్యమని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఈవీఎస్‌కే బాబు పేర్కొన్నారు. అబిడ్స్‌లోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో ఇన్నోవిస్ట–2024 విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. లిటిల్‌ఫ్లవర్ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతుండడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ రేవ్ బ్రదర్ షజాన్ ఆంథోని మాట్లాడుతూ..లిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు విశ్వవ్యాప్తంగా ప్రముఖ రంగాల్లో ప్రదర్శన చూపుతున్నారన్నారు. విద్యార్థులను వారి అభిరుచులకు అనుగుణంగా ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ విలియస్ డేమేల్, బ్రదర్ ఆపాలి డిసోజా, బ్రదర్ జాకోట్‌లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అజిత్ కుమార్, దీప్తి జైస్వాల్, సంధ్యారాణి, సంపత్‌కుమార్, బాల్‌రెడ్డి, బ్రిజ్‌మోహన్, రమేష్, సునిత మార్యలతో పాటు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన గాలిలో ఎగిరే విమానాలు, నేలపై నడిచే రోబోటిక్‌లు, మానవుని గుండె పనితీరు, నీటి శుద్ధి కేంద్రాలు, రోబోటిక్ సారశక్తిలాంటి పలు విభాగాల్లో విద్యార్థులు నైపుణ్యాన్ని చాటుతూ స్వయంగా తయారు చేసిన ఈ పరికరాలు అన్ని అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

జూపార్కులో ఫాస్ట్ ట్రాక్ పార్కింగ్



బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కు సందర్శకుల వాహనాల పార్కింగ్‌లో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఫాస్ట్‌ట్రాక్‌తో సాఫీగా కొనసాగే విధంగా జూపార్కు అధికారులు చర్యలు చేపట్టారు. కొన్ని నెలలుగా ఫాస్ట్‌ట్రాక్‌తో వాహనాల పార్కింగ్ ఆలస్యం కాకుండా వేగంగా అవుతుండటంతో జూపార్కులో ఎక్కువ సమయం సందర్శకులు గడిపే వీలు చిక్కింది. పార్కింగ్ స్థలాన్ని విశాలం చేయడంతో సందర్శకులు అలా పార్కు చేసి ఇలా వచ్చేస్తున్నారు. గతంలో ఈ పార్కింగ్‌ను కాంట్రాక్ట్ ద్వారా నిర్వహించే అధికారులు ఈసారి సొంతంగా జూపార్కు అధికారులు నిర్వహిస్తున్నారు. ఫాస్ట్‌ట్రాక్‌తో పార్కింగ్ ఫీజు కూడా ఎప్పటికప్పుడు జూపార్కు అకౌంట్‌లోకి నేరుగా చేరుతున్నాయి.

వైభవంగా పాశుపత రుద్ర ఆరోగ్య హోమం



గన్‌ఫౌండ్రీ: కార్తీక మాసం వేడుకల్లో భాగంగా పాశుపత రుద్ర ఆరోగ్య హోమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాలతో ఈ హోమాన్ని చేపట్టారు. విద్యానగర్ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో హోమం వేడుకలు జరిగాయి. మాస శివ రాత్రి పూజలు రాత్రి వరకు చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు, ప్రముఖులు పాల్గొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కరాటేలో సత్తాచాటిన సయ్యద్ ఫరీదా సుల్తానా



కాంస్య పతకం అందుకున్న సయ్యద్ ఫరీదా సుల్తానా

జియాగూడ: ఇండియా గర్వించే విధంగా 11 కామన్వెల్త్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఫరీదా సుల్తానా కాంస్య పతకం సాధించింది. శుక్రవారం సౌత్ ఆఫ్రికాలోని దర్బన్‌లోగల ఓలీవ్ కన్వెన్షన్ సెంటర్ (ఎలీట్)లో సౌత్ ఆఫ్రికా కరాటే ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కరాటే పోటీలకు ప్రపంచంలోని 16 దేశాల నుంచి కరాటే క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో అండర్ 21 ఇయర్స్ 61 కేజీల విభాగంలో సయ్యద్ ఫరీదా సుల్తానా ఇండియా తరపున బ్రాంజ్ మెడల్ సాధించింది. గతంలో కూడా రెండు సార్లు యూఎస్ఏ ఓపెన్ కరాటే చాంపియన్, మలేషియా, థాయిలాండ్, షార్జా, యూఏఈలలో చాంపియన్‌గా గెలుపొందింది. ఈ సందర్భంగా పాకో మార్షల్ ఆర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ శిక్షకులు షిహాన్ సయ్యద్ ఇఫ్తేకార్ హుస్సేన్ (డబ్ల్యూకేఎఫ్–కోచ్ అండ్ ఏకేఎఫ్ జడ్జ్–ఏ) మాట్లాడుతూ..సయ్యద్ ఫరీదా సుల్తానా చాంపియన్‌గా 8 ఏళ్ల నుండి సొంతంగా పాకో మార్షల్ ఆర్ట్స్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీలో కరాటే ప్రాక్టీస్ చేస్తూ బ్లాక్ మొదటి డాన్–షోడాన్ నిలిచి ఎన్నో అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్‌కు సంబంధించిందన్నారు. సౌత్ ఆఫ్రికాలో జరిగిన కరాటే పోటీలకు కరాటే ఇండియా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు హెచ్.భరత్‌శర్మ, సహకారంతో పాటు తెలంగాణ కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఆశీర్వాదం, ఈవెంట్ హోస్టండ్‌గా కామన్‌వెల్త్ ఫెడరేషన్ అధ్యక్షులు హాంషి సోన్ని పిల్లయ్ వ్యవహరించారు.

క్రీడలపై దృష్టి సారించాలి


స్పోర్ట్స్ డే ముగింపులో విద్యార్థులతో కరచాలనం చేస్తున్న డీసీపీ శ్రీనివాస్

బహదూర్‌పురా: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ అన్నారు. కిషన్‌బాగ్ గురునానక్ హై స్కూల్ యానువల్ స్పోర్ట్స్ డే ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యార్థులకు మానసిక, శారీరక దృఢత్వం అవసరమని..ఈ రెండు ఉన్నప్పుడే వ్యక్తిగతంగా, వృత్తిపరంగా సమాజంలో గుర్తింపు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఏసీపీ టి.శ్రీనివాస్, సిక్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.ప్రీతమ్ సింగ్, ఉపాధ్యక్షులు ఎస్.బహదూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్.దర్శన్ సింగ్, జాయింట్ సెక్రటరీ ఎస్.ఇక్బాల్ సింగ్, గురుద్వారా సాహేబ్ బరంబల అధ్యక్షులు ఎస్.చేతన్ సింగ్ షికారి, పాఠశాల సెక్రటరీ ఎస్.సజ్జన్ సింగ్, ప్రిన్సిపాల్ రుక్సానా అహ్మద్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


రేణుక యారా

యాకుత్‌పురా: డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ రేణుక యారా సూచించారు. శనివారం పురానీహవేలీలో సిటీ సివిల్ కోర్టులోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది మార్చి, జూన్, సెప్టెంబర్‌లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 1643 కేసులను పరిష్కారించి బాధితులకు రూ.100 కోట్లకు పైగా నష్టపరిహారాన్ని అందించడం జరిగిందన్నారు. 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ప్రత్యేకంగా మోటారు వాహన ప్రమాదాల కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ లోక్ అదాలత్‌లో ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సహకారంతో ప్రత్యేక మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం అందించేందుకు డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. ధ్రువీకరణ పత్రం పొందిన వారికి ఇన్సూరెన్స్ కంపెనీల సహకారంతో నష్టపరిహారం అందిచేందుకు చర్యలు తీసుకుటమన్నారు.

అభినందనలు


అంధ విద్యార్థులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: ఈ నెల 27 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో దారుషిఫా ప్రభుత్వ అంధ పాఠశాల విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించారు. ఈ పోటీల్లో భాగంగా షార్ట్ పుట్ జూనియర్స్ విభాగాంలో పాఠశాల 9వ తరగతి విద్యార్థి వి.శివ ఉత్తమ ప్రతిభతో బంగారు పతకం సాధించగా.. 50 మీటర్ల పరుగు పందేం పోటీల్లో 10వ తరగతి విద్యార్థి ఎస్.భీంరావు రజత పతకం సాధించాడు. పతకాలు సాధించిన విద్యార్థులను శనివారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు సద్గుణ, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండడి వెంకట్‌రెడ్డి,ఉపాధ్యాయులు సునంద, యాదమ్మ, అంజుమ్ ఆఫ్రోజ్, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, రామారావు, సల్లావుద్దీన్, రవీందర్ రెడ్డి సన్మానించి అభినందించారు.

జోగులాంబ శక్తిపీఠ ఆలయ ప్రధాన అర్చకుడిని తొలగించాలి


దేవాదాయ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: ఆలంపూర్ జోగులాంబ శక్తిపీఠం ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మను తొలగించాలంటూ జోగులాంబ ఆలయ అర్చకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బొగ్గులకుంటలోని ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయం ముందు అర్చకులు ఆందోళనకు దిగారు. ఆనంద్‌శర్మ ప్రధాన అర్చకుడిగా ఉంటూ..ఆలయ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అమ్మవారికి వచ్చే కానుకలు, ఆభరణాలు మాయం అవుతున్నాయని, ఎండోమెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇటీవల అల్లంపూర్ ఎమ్మెల్యే కుటుంబంతో సినిమాకు వెళ్తే ఆయనకు తెలియకుండా ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడ్డారని, దీనితో ఎమ్మెల్యే ఫిర్యాదుతో ఆనంద్‌శర్మపై కేసు నమోదు అయ్యిందన్నారు. జిల్లాలో వివాదాస్పదంగా వ్యవహరిస్తున్న ఆనంద్ శర్మను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో వేలాది మంది అర్చకులతో చలో ఆలంపురాకు పిలిపునిస్తామని వారు హెచ్చరించారు. పులికల్ అశోక్, వడ్డే రాజు, శేషయ్య, రవీందర్, ప్రసాద్, కొత్తకోట శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలి


డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్‌కు మెమెంటో అందజేసి సత్కరిస్తున్న మహేష్ కుమార్ గౌడ్

అఫ్జల్‌గంజ్/చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఇటీవల అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ ఎక్సెస్ నుంచి అవార్డు అందుకున్న తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ అభినందనీయులని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం రాజనారాయణ ముదిరాజును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యులు జి .సీతారామరాజు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి బి వెంకటేష్ ముదిరాజ్, నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



చాంద్రాయణగుట్ట: కార్తీక మాసం ముగింపులో భాగంగా రక్షాపురంలోని శనివారం రుద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నేతి మాధవ శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన లక్ష బిల్వార్చన కార్యక్రమంలో స్థానిక మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని నెల రోజులుగా ప్రత్యేకంగా కొనసాగిన పూజా కార్యక్రమాలతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈఓ శ్రీనివాస్, ఇన్‌చారి పార్థసారథి తగిన చర్యలు తీసుకున్నారు.

నియామకం


శారద నేనావత్‌కు నియామకపత్రం అందజేస్తున్న చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్

యాకుత్‌పురా: టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్ అండ్ ఆర్‌టీఐ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా హైకోర్టు న్యాయవాది శారద నేనావత్ నియమితులయ్యారు. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ శనివారం తన కార్యాలయంలో ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఉన్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శారద నేనావత్ సేవలను గుర్తించి నియమించినట్లు ఆయన తెలిపారు. తనపై నమ్మకంలో బాధ్యతలు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, జయేంద్ర బాలాజీ, కుమార్, వెంకట రంగాదాస్, మురళీధర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎల్వీ సుబ్రహ్మణ్యం, చిత్రంలో ఎంవీఆర్ శాస్త్రి, వల్లీశ్వర్

నాంపల్లి: అక్షజ్ఞ పబ్లికేషన్స్ నిర్వహణలో శనివారం రాత్రి నందమూరి తారక రామారావు కళా మందిరంలో చేంబోలు శ్రీరామ శాస్త్రి రచించిన సిరివెన్నెల తొలి గురువు 'సమ్మాన్యుడు' పుస్తకావిష్కరణ సభ జరిగింది. సిరివెన్నెల సీతారామశాస్త్రి గురువు సత్యారావు అధ్యక్షతన జరిగిన సభకు ఆత్మీయ అతిథులుగా ఏపీ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ప్రముఖ పాత్రికేయులు ఎంవీఆర్ శాస్త్రి, గుండు వల్లీశ్వర్, కౌముది అంతర్జాల పత్రిక సంచాలకులు కిరణ్ ప్రభ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. సిరివెన్నెల సుమధుర జ్ఞాపకాలు సంకలీకరణ జరగడం సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సిరివెన్నెల సీతారామ శాస్త్రి అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ధినేష్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: డిసెంబర్ 1వ తేదీన పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు ఎస్.ధినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గన్‌ఫౌండ్రీలోని సంఘం కార్యాలయంలో సింహగర్జన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల ఐక్యతను నిరూపించేందుకు నిర్వహిస్తున్న ఈ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం గన్‌ఫౌండ్రీ ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీ నారాయణ, జయబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురాను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ఆలె భాగ్యలక్ష్మి అన్నారు. అంబికానగర్‌లో శనివారం ఆమె జీహెచ్‌ఎంసీ ద్వారా మంజూరైన రూ.3.10 లక్షల నిధులతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..డివిజన్‌లో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. బస్తీవాసులు రోడ్డు శిథిలావస్థకు చేరుకుందని తన దృష్టికి తీసుకురావడంతో జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయించి నూతన పనులను ప్రారంభించామన్నారు. డివిజన్ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ తేజోవంత్, బీజేపీ నాయకులు ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, జమాల్‌పూర్ అశోక్, కె.ప్రేమ్‌రాజ్, బి.రమేశ్ యాదవ్, బస్తీవాసులు బాలాజీ, శివాజీ, బండారి, ఎం.విలాస్ తదితరులు పాల్గొన్నారు.

'హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ పేరుతో కుట్ర'


పులిపాటి రాజేష్ కుమార్

చార్మినార్: రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు సంక్షేమ గురుకుల హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజన్ అంటూ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ నాయకుడిగా కొనసాగుతున్న ఒకప్పటి సంక్షేమ హాస్టళ్ల కార్యదర్శిగా పని చేసిన వారే హాస్టల్లో ఫుడ్ పాయిజన్‌కు తెరలేపారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యకు ప్రాముఖ్యత ఇస్తూ సంక్షేమ హాస్టల్స్‌లో డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచడంతో పేద విద్యార్థులలో విద్య పట్ల ప్రభుత్వ చర్యల పట్ల ఆసక్తి, విశ్వసనీయత బాగా పెరిగిందన్నారు. దీన్ని దెబ్బతీసి ప్రభుత్వ ప్రతిష్ఠను దిగజార్చేందుకు బీఆర్‌ఎస్ భారీ కుట్ర చేసిందన్నారు.

దివ్యాంగులకు ధ్రువపత్రాలు అందజేత



గోల్కొండ: దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైయ్యే అర్హుల గుర్తింపు కార్యక్రమాన్ని శనివారం గుడిమల్కాపూర్‌లో నిర్వహించారు. గుడిమల్కాపూర్‌లోని ఎస్‌బీఐ కమ్యూనిటీహాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్‌తో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు హాజరయ్యారు. దివ్యాంగులకు సహాయ పరికరాలు, ఉచితంగా పంపిణీ చేసేందుకు ఈ అసెస్‌మెంట్ క్యాంప్ నిర్వహించామని నాంపల్లి నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ పవన్ అన్నారు. ప్రతి యేటా తాము నిర్వహించే ఈ క్యాంపు వల్ల ఎందరో దివ్యాంగులు అవసరమైన ధ్రువపత్రాలు పొందుతున్నారన్నారు. బీజేపీ నాయకులు దేవర వంశీ, ప్రభు పూజారి, అనిల్‌కుమార్, విజయ్, రవి తదితరులున్నారు.

సేవా కార్యక్రమాలతో సమాజంలో గౌరవం


నాసర్‌కు సభ్యత్వ బుక్‌లెట్ అందజేస్తున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: సేవా కార్యక్రమాలతో సమాజంలో గౌరవంలభించడమే కాక సంతృప్తి లభిస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆఫీస్‌పేట్‌కు చెందిన నాసర్‌కు శుక్రవారం ఆయన టీఎఫ్‌సీవో సభ్యత్వ బుక్‌లెట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 ఏళ్లుగా తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలోని జిల్లా కేంద్రాల్లో టీఎఫ్‌సీవో కార్యాలయాలు తెరవడానికి ఆయా జిల్లాల నుంచి తమ వద్దకు వస్తున్నారన్నారు. అయితే ఇప్పటికే సంగారెడ్డి, మెదక్, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లా కేంద్రాల్లో టీఎఫ్‌సీవో కార్యాలయాలు ప్రారంభించామన్నారు. మరిన్ని జిల్లాల్లో సేవా కార్యక్రమాల్లో అభిరుచి ఉన్న వారికి కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఇస్తామన్నారు.

సీఎం కప్‌ను విజయవంతం చేద్దాం


శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్‌ను విజయవంతం చేద్దామని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. ప్రజా పాలన విజయోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సీఎం కప్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల వివరాలను శనివారం ఎల్బీస్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామీణ క్రీడా రంగాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు తమ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా ఒక వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలియజేశారు. డిసెంబర్ 7, 8 తేదీలలో గ్రామస్థాయిలో, 10 నుంచి 12 వరకు మండల స్థాయిలో, 16 నుంచి 21 జిల్లా స్థాయిలో, 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని వెల్లడించారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సహజం



డేవిడ్‌ను సత్కరిస్తున్న రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు

అబిడ్స్: పదవీ విరమణ ప్రతి ఉద్యోగికి సహజమని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు, కేఆర్.రాజ్‌కుమార్, స్కూల్ ఎడ్యుకేషన్ సెక్రెటరి ఎం.భాస్కర్ పేర్కొన్నారు. హైదరాబాద్ విద్యాశాఖలో సూపరింటెండెంట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన వి.డేవిడ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ..30 ఏళ్లకు పైగా విద్యాశాఖ రంగంలో డేవిడ్ చేసిన పని అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నర్సింగ్‌రావు, రూగేష్, ముక్తదార్, జయంత్‌రెడ్డి, ప్రియదేవ్ ఠాకూర్, అరుణ, లావణ్య, అనురాధ, విజయలక్ష్మి, ప్రవీణ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడి అరెస్ట్


లంగర్‌హౌస్: నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌లో నివాసముండే రవీంద్ర నాయక్(32) మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ చదివాడు. అనంతరం అక్కడ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేసి రెండేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. లంగర్‌హౌస్ డిఫెన్స్ కాలనీలో అద్దెకు ఉంటూ అక్షర క్లినిక్ పేరుతో వైద్యశాలను ప్రారంభించాడు. వైద్యంతో పాటు అందరికి ఇంజక్షన్‌లు కూడా ఇస్తున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడ విచారించగా అతను నకిలీ వైద్యుడని తేలింది. దీంతో శనివారం రవీంద్రనాయక్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేదలకు అండగా మజ్లిస్ పార్టీ


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌసర్, మాజీద్ హుస్సేన్

గోల్కొండ: పేదలకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటూ వచ్చిందని మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్ మోహియుద్దీన్, మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు వారిని కలిసి తమ సమస్యలను వెల్లబుచ్చుకున్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికి మజ్లిస్ అండగా ఉంటుందన్నారు. అనంతరం గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్‌లో అధికారులు తమను వేధిస్తున్నారని పలువురు కూరగాయల వ్యాపారులు ఎమ్మెల్యేలకు ఫిర్యాదులు చేశారు. మార్కెట్ కమిటీ వారు తమ స్టాల్స్ కూల్చివేశారని తమ వద్ద కోర్టు ఉత్తర్వులు ఉన్నా కూడా వ్యాపారాలు చేసుకోనివ్వడం లేదని వారు వివరించారు. సంబంధిత మార్కెట్ కమిటీ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యేలు వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఇంట్లో కుటుంబ సర్వే


అధికారులకు వివరాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే

నాంపల్లి: మెహిదీపట్నం సర్కిల్–12 అధికారులు శనివారం నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఇంట్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ అధికారులకు తమ కుటుంబ వివరాలను ఇచ్చారు. సర్కిల్–12 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఎన్యుమరేటర్ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే ఇంటికి వెళ్లారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించి కంప్యూటర్‌లో భద్రపరిచారు. అలాగే మాజీ ఎమ్మెల్యే విరాసత్ రసూల్ ఖాన్ ఇంట్లో కూడా అధికారులు సర్వే చేపట్టారు.

జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు రాణించాలి


జాతీయ స్థాయి పోటీలకు వెళ్తున్న టీమ్ సభ్యులతో నరేష్‌కుమార్

గన్‌ఫౌండ్రీ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న 68వ స్కూల్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు తెలంగాణ జట్టు శనివారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నరేష్‌కుమార్ మాట్లాడుతూ..జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. అండర్–17 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 38 టీమ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీమ్ కోచ్ ప్రేమ్‌కుమార్, మేనేజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

అఫ్జల్‌గంజ్: బీఎంఎస్ హైదరాబాద్ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన టి.కృష్ణ, కార్యదర్శి ఆర్.వెంకటేష్‌ను ఘనంగా సత్కరించారు. భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు జి.రాజేశ్వర్‌రావు, సెక్రెటరి రూపేష్ జయకృష్ణ, మహిళా సెక్రెటరి మనోరమ్మ, శ్రీకాంత్, భరత్, రాఘవేంద్ర, చంద్రశేఖర్, గంగమ్మ, పుష్పమ్మలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టి.కృష్ణ, వెంకటేష్ మాట్లాడుతూ..ఉద్యోగుల సంక్షేమం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటు పడుతామన్నారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.


బీఎంఎస్ నూతన అధ్యక్షుడి టి.కృష్ణను సన్మానిస్తున్న దృశ్యం